సాక్షి శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

ఆదివారం । 19 । నవంబర్ । 2023



సోమశిలలో 29.545 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో శనివారం సాయంత్రానికి 29.545 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 14 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	-రూ.62,860
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా)	- రూ.5,651
3 శాతం జీఎస్టీతో..	- రూ.5,821
నవర (8 గ్రా)	- రూ.46,568

గరిష్టం/కనిష్టం
32.4 /26.5

వాతావరణం

శనివారం గాలిలో తేమ 72 శాతం ఉంది. ఆదివారం జిల్లాలో ఉష్ణోగ్రతలు, ఎండతీవ్రత సాధారణంగా ఉండే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

అయ్యప్పస్వామికి మండలపూజ



వేదాయపాళెం అయ్యప్పస్వామి ఆలయంలో శనివారం శబరిమలవాసుడికి అభిషేక, హోమ పూజలు, మహాదీపారాధన నిర్వహించారు. కేరళ సంప్రదాయరీతిలో జరిగిన పూజ కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని స్వామిఅయ్యప్పను దర్శించుకున్నారు. - నెల్లూరు(బృందావనం)

వెంగమాంబ హుండీ కానుకల లెక్కింపు



నర్రవాడ వెంగమాంబ పేరంటాలు దేవస్థానం హుండీలను శనివారం దేవస్థానం ఆవరణలో దేవదాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో లెక్కించారు. జూలై 26వ తేదీ నుంచి భక్తులు హుండీలలో సమర్పించిన కానుకలను లెక్కించగా రూ.20,74,130 ఆదాయం లభించినట్లు ఈఓ. ఉషశ్రీ తెలిపారు. - దుత్తలూరు

ఝాన్సీ లక్ష్మీభాయ్‌కి నివాళి



కాకుటూరు వద్దనున్న వీఎస్‌యూలో శనివారం ఆంధ్రా విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఝాన్సీ లక్ష్మీభాయ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ చాన్సలర్ జీఎం సుందరవల్లి ఝాన్సీ లక్ష్మీభాయ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. - వెంకటాచలం

న్యూస్‌రీల్

9న జాతీయ లోక్ అదాలత్

నెల్లూరు(లీగల్): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో డిసెంబర్ 9వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ సి.యామిని తెలిపారు. నెల్లూరులోని జిల్లా కోర్టు ఆవరణలో ఉన్న కోర్టు హాల్‌లో శనివారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు నెల్లూరుతోపాటు కోవూరు, కావలి, గూడూరు, వెంకటగిరి, ఆత్మకూరు, కోట, ఉదయగిరి, నాయుడుపేట, సూళ్లూరుపేట కోర్టుల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరిష్కరించదగిన కేసుల్లోని కక్షిదారులు జాతీయ లోక్ అదాలత్ ద్వారా కేసులను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వాణి పాల్గొన్నారు.

జాతీయ రహదారి నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న అధికారులు

ఉదయగిరి: సీతారామపురం-దుత్తలూరు మార్గంలో రూ.364 కోట్లతో 36 కిలోమీటర్ల మేర 167బీజీ జాతీయ రహదారి నిర్మాణానికి శనివారం ఉదయగిరి మండలం కుర్రపల్లి సమీపంలో ఎంఆర్‌జీ కన్‌స్ట్రక్షన్స్ ఎండీ ముత్యాల గోవిందరెడ్డి, డైరెక్టర్లు శ్రీనివాసులురెడ్డి, చంద్రమోహన్‌రెడ్డిలతో కలిసి హైవే డీఈ, ఏఈలు అనిల్‌కుమార్‌రెడ్డి, సుమన్ భూమిపూజ నిర్వహించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ సీతారామపురం, దుత్తలూరు, ఉదయగిరి మండలాల్లో రోడ్డు నిర్మాణానికి అవసరమైన 75 ఎకరాల భూసేకరణ పూర్తయిందని, భూహక్కుదారులైన రైతు లకు ప్రభుత్వం నష్టపరిహారం మంజూరు చేసిందని తెలిపారు. ఏడాది లోపు రహదారి నిర్మాణ పనులు పూర్తయ్యేలా చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గానుగపెంట ఓబుల్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ కల్లూరి కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు డి.గురవారెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పి.రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లుల బకాయిల పేరుతో మోసాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ బిల్లులు చెల్లించాలంటూ గుర్తుతెలియని వ్యక్తులు వినియోగదారులకు ఫోన్ చేసి వారి నుంచి ఆన్‌లైన్ పద్ధతిలో నగదు దోపిడీ చేస్తున్నారని, వినియోగదారులు ఈ ముఠాల చేతుల్లో మోసపోకుండా జాగ్రత్తగా ఉండేలా చైతన్యపరచాలని ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్‌ఈ విజయన్ జిల్లా విద్యుత్‌శాఖ అధికారులను ఆదేశించారు. నగరంలోని విద్యుత్ భవన్‌లో శనివారం జిల్లా విద్యుత్‌శాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గుర్తుతెలియని వ్యక్తులు విద్యుత్ వినియోగదారులకు ఫోన్ చేసి 'మీరు విద్యుత్ బిల్లులు చెల్లించలేదు.. వెంటనే చెల్లించకపోతే కరెంట్ కట్ చేస్తాం.. సందేహాలు ఉంటే విద్యుత్ అధికారికి ఫోన్ చేయాలంటూ ఆన్‌లైన్ లింక్ పంపి బ్యాంకు ఖాతాలోని నగదు దోచేస్తున్నారని తెలిపారు.

తీరు మార్చుకోకపోతే వేటు

సక్రమంగా పనిచేయకపోతే డిమోట్ చేస్తా

- డిప్యూటీ ఈఓను సస్పెండ్ చేయాలని డీఈఓకు ఆదేశాలు
- ప్రభుత్వం విద్య కోసం రూ.కోట్లు ఖర్చుపెడుతున్నా మారని విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయుల తీరు
- రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్



లింగసముద్రం: మొగిలిచర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యాశాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్

లింగసముద్రం: ఉపాధ్యాయులు బాధ్యతతో పనిచేసి విద్యార్థుల చదువులను మెరుగుపరచాలని, పనితీరు మార్చుకోకపోతే వేటు తప్పదని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్ హెచ్చరించారు. శనివారం జిల్లాలోని లింగసముద్రం మండలం మొగిలిచర్లలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను, గంగపాళెంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. మొగిలిచర్ల జెడ్పీ ఉన్నత పాఠశాల ఆరో తరగతి విద్యార్థినీ విద్యార్థులను సోషల్ పాఠ్యాంశాల్లోని కొన్ని ప్రశ్నలు వేసి వాటి సమాధానాలు నోట్ పుస్తకాల్లో రాశారా లేదా అని తనిఖీ చేయగా, ఆరుగురు మాత్రమే ఆ ప్రశ్నలకు సమాధానం రాయడంపై విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జూన్ నుంచి నవంబర్ వరకు విద్యార్థులకు పాఠాలు ఎంతవరకు చెప్పారని, ఈ విధంగా ఉంటే విద్యార్థులు ఆరు నెలల పరీక్షలు ఎలా రాస్తారని మండిపడ్డారు. జిల్లాలో ఎన్ని పాఠశాలలు తనిఖీ చేశారు.. ఎంతమంది ఎంఈఓలు రిపోర్టులు పంపారని డీఈఓ గంగాభవాని, డిప్యూటీ ఈఓ శ్రీనివాసరావులను ప్రశ్నించారు. అందుకు వారు సమాధానమిస్తూ మాకు ఎంఈఓలు రిపోర్టులు పంపడం లేదని చెప్పడంతో 'మాకు పనిలేక తిరుగుతున్నామా.. మీరు అసలు పనిచేయడం లేదని నాకు అర్థమైందంటూ' వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డిప్యూటీ ఈఓను మీరు ఎన్నిసార్లు పాఠశాలలను విజిట్ చేశారని అడగగా, తాను గుంటూరు జిల్లాలో హెచ్‌ఎంగా ఉంటున్నానని విజిట్లకు వెళ్లడం లేదని చెప్పడంతో ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేసి సస్పెండ్ చేస్తానని హెచ్చరించారు. అదే తరహాలో డీఈఓ కూడా పనిచేస్తుండడంతో ఆమెను డిప్యూటీ ఈఓగా డిమోట్ చేస్తానని అన్నారు. ప్రభుత్వం నుంచి లక్షల రూపాయల జీతాలు తీసుకుంటున్న మీరు ఎందుకు పనిచేయడం లేదని నిలదీశారు. ఎన్నిసార్లు జూమ్ మీటింగుల్లో చెప్పినా తీరు మార్చుకోవడం లేదన్నారు. సక్రమంగా పనిచేయని అధికారులు, ఉపాధ్యాయులకు టీఏ, డీఏల్లో కోత పెడతామని హెచ్చరించారు. పాఠశాలలో నాడు-నేడు ఫేస్-2 ద్వారా జరుగుతున్న మరుగుదొడ్లు, ఇతర పనులను పరిశీలించారు. జగనన్న గోరుముద్ద కార్యక్రమం ఎలా అమలు చేస్తున్నారంటూ వంటగదికి వెళ్లి అక్కడ చేస్తున్న వంటలను రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు.

పాఠాలు చెబితే విద్యార్థులు ఎందుకు రారు?

మధ్యాహ్నం గంగపాళెంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ప్రవీణ్ ప్రకాష్ తనిఖీ చేశారు. పాఠశాలలో 30 మంది విద్యార్థులు ఉండగా, ఇద్దరు ఉపాధ్యాయులు అవసరమా అని అడిగారు. గంగపాళెం నుంచి ప్రైవేట్ పాఠశాలకు విద్యార్థులు ఎక్కువగా వెళుతున్నారని చెప్పడంతో ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మీరు సక్రమంగా పాఠాలు చెబితే విద్యార్థులు ఎందుకు రారని వారిని ప్రశ్నించారు. ముందుగా నాలుగో తరగతి విద్యార్థుల నోట్ పుస్తకాలను తనిఖీ చేయగా వారు సమాధానాలు సక్రమంగా రాయడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. ఒకటి నుంచి మూడో తరగతి విద్యార్థుల నోట్ పుస్తకాలను తనిఖీ చేయగా ఒక్కరు కూడా నోట్ పుస్తకాల్లో రాయకపోవడంపై ఆ ఉపాధ్యాయుడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం నాడు-నేడు కింద రూ.కోట్లు ఖర్చు చేసి ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తుంటే విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు విద్యార్థుల చదువులతో ఆటలాడుకుంటున్నారని, ఈ పద్ధతి మార్చుకోవాలని తెలిపారు. వారం రోజుల్లో పాఠశాలలన్నింటిపై రిపోర్టు అందజేయాలని డీఈఓను ఆదేశించారు. ఎంఈఓలు ప్రతిరోజూ ఏదో ఒక పాఠశాలను తనిఖీ చేసి డీఈఓకు రిపోర్టు పంపాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన చేయిస్తే 100 శాతం ఉత్తీర్ణత సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో ఆర్‌జేడీ సుబ్బారావు, కందుకూరు సబ్‌కలెక్టర్ శోభిక, ట్రెయినీ కలెక్టర్ సంజనాసిన్హా, ఎంఈఓ రవికుమార్, తహసీల్దార్ టి.ప్రసాద్, ఎంపీడీఓ శేషుబాబు, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థుల సంఖ్యను పెంచుదాం

గుడ్లూరు: మనబడి నాడు-నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దుతున్న నేపథ్యంలో సర్కారు బడుల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్ సూచించారు. గుడ్లూరు మండలంలోని నరసాపురం ప్రాథమిక పాఠశాలను ప్రవీణ్‌ప్రకాష్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని రికార్డులు, రిజిస్టర్లు పరిశీలించారు. పలు పాఠ్యాంశాలపై ప్రశ్నించగా విద్యార్థులు కొన్నింటికి సమాధానాలు చెప్పకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండడంపై కూడా ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 29 మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు ఉండి కూడా పాఠ్యాంశాలను సక్రమంగా బోధించకపోతే ఎలా అని ప్రశ్నించారు. తీసుకునే జీతాలకు న్యాయం చేయకపోతే ఎలా అని మండిపడ్డారు. ఉపాధ్యాయులు శ్రద్ధ వహించి విద్యార్థులను తీర్చిదిద్దాలని సూచించారు. ఆయన వెంట ట్రెయినీ కలెక్టర్ సంజనాసిన్హా, ఆర్జేడీ సుబ్బారావు, డీఈఓ గంగాభవాని, సబ్ కలెక్టర్ శోభిక, డిప్యూటీ ఈఓ శ్రీనివాసులు, ఎంఈఓలు శ్రీనివాసులు, గంగాధర్, పలువురు ఉన్నతాధికారులు ఉన్నారు.



గుడ్లూరు: నరసాపురం ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేస్తున్న ప్రవీణ్‌ప్రకాష్

పకడ్బందీగా కులగణన



మాట్లాడుతున్న జేసీ కూర్మనాథ్

నెల్లూరు(పొగతోట): కులగణనకు సంబంధించి శిక్షణ కార్యక్రమాలు పూర్తి చేసి ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ ఆర్.కూర్మనాథ్ అధికారులను ఆదేశించారు. శనివారం నగరంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులు, ఎంపీడీఓలు, తహసీల్దార్లతో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో జేసీ మాట్లాడారు. ఈ నెల 27వ తేదీ నుంచి కులగణన సర్వే ప్రక్రియ ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని, దీనికి సంబంధించి డివిజన్, మండల స్థాయిల్లో శిక్షణ కార్యక్రమాలను పూర్తి చేయాలని తెలిపారు. 2023 కులగణన ప్రక్రియను పక్కాగా పూర్తి చేసేలా అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. ఇంటింటి సర్వే సమయంలో ప్రజలు నిర్భయంగా వివరాలు అందజేయవచ్చని తెలిపారు. ప్రస్తుతం నిర్వహించే కులగణన సర్వే ప్రక్రియ ఇతర ప్రభుత్వ పథకాలకు, ఉద్యోగాల భర్తీకి ఉపయోగపడదన్నారు. ప్రజల ఆస్తులు, విద్యార్హతలు తదితర వివరాలు సేకరించనున్నట్లు తెలిపారు. సర్వే పూర్తయిన తర్వాత తప్పనిసరిగా బయోమెట్రిక్ తీసుకోవాలని సూచించారు. ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి వివరాలను ఓటీపీ ద్వారా సేకరించాలని తెలిపారు. ప్రజల నుంచి సేకరించిన వివరాలను ప్రత్యేక యాప్ ద్వారా అప్‌లోడ్ చేయనున్నట్లు తెలిపారు. జెడ్పీ సీఈఓ చిరంజీవి మాట్లాడుతూ ఈ నెల 22వ తేదీన మండల స్థాయిలో శిక్షణ కార్యక్రమాలు పూర్తి చేయాలన్నారు. వలంటీర్ మ్యాపింగ్ తప్పనిసరి చేయాలని, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు ఇంటింటికి తిరిగి కులగణన సర్వే ప్రక్రియ చేపడతారని తెలిపారు. సమావేశంలో సాంఘిక సంక్షేమశాఖ డీడీ రమేష్, బీసీ వెల్ఫేర్ అధికారి వెంకటయ్య, వివిధ శాఖల అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి నీటి విడుదల

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఐఏబీ సమావేశం తీర్మానం మేరకు ఈ నెల 20వ తేదీ నుంచి సోమశిల జలాశయం నుంచి నీటిని విడుదల చేయనున్నట్లు ఇరిగేషన్ ఎస్‌ఈ కృష్ణమోహన్ శనివారం తెలిపారు. సోమశిల జలాశయం నుంచి పెన్నా డెల్టా పరిధిలో 2 లక్షల ఎకరాలకు సాగునీటిని అందిస్తామని తెలిపారు. సంబంధిత ఆయకట్టు రైతులందరూ నార్లు పోసుకునేందుకు నీరు విడుదల చేస్తున్నామని తెలిపారు. నీటి లభ్యత తక్కువగా ఉన్న నేపథ్యంలో పొదుపుగా వాడుకోవాలని సూచించారు

వంద ఆలయాలు నిర్మించాలనే సంకల్పం

- సర్వేపల్లిలో ఇప్పటి వరకు 60 ఆలయాల నిర్మాణం
- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



విఘ్నేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు : భగవంతుని ఆశీర్వాదం తోడుగా ఉంటే సర్వేపల్లి నియోజకవర్గంలో పేద, ధనిక అనే తేడా లేకుండా అందరికీ భగవంతుడిని చేరువ చేయాలనే లక్ష్యంతో వంద దేవాలయాలను నిర్మించాలనే సంకల్పంతో ఉన్నట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని వరదాపురం గిరిజన కాలనీలో నూతనంగా నిర్మించిన విఘ్నేశ్వరస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి కాకాణి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత ఆలయానికి విచ్చేసిన మంత్రికి అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రూ.10 లక్షల టీటీడీ శ్రీవాణి నిధులతో సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రజలు కోరుకున్న ఆలయాలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. వరదాపురంలో వినాయకస్వామి ఆలయాన్ని నిర్మించామని, ఇందుకు టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, నూతన చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, ఈఓ ధర్మారెడ్డి సహకారం అందజేశారని తెలిపారు. సర్వేపల్లి నియోజకవర్గంలో దేవాలయం లేని ఊరు ఉండకూడదనే లక్ష్యంతో ఎక్కడ ఆలయం నిర్మించాలని ముందుకొచ్చినా ప్రత్యేక చొరవ తీసుకుని నిధులు మంజూరు చేయిస్తున్నట్లు తెలిపారు.

'గడప గడప'లో సమస్యలకు పరిష్కారం

'గడప గడపకు మన ప్రభుత్వం'లో గుర్తించిన సమస్యలను పరిష్కరిస్తున్నామని మంత్రి కాకాణి తెలిపారు. వరదాపురం గిరిజనకాలనీ వాసులు సిమెంటురోడ్డు నిర్మించాలని కోరగా, నుడా నుంచి రూ.35 లక్షలు మంజూరు చేయించి శరవేగంగా పనులు పూర్తి చేయించిన విషయాన్ని గుర్తుచేశారు. గ్రామాల్లో డ్రైనేజీలు, సిమెంటురోడ్లు, ఇతర మౌలిక వసతులకు సంబంధించిన సమస్యలను పరిష్కరించామని తెలిపారు. ఒక్క తాటిపర్తి పంచాయతీలోనే రూ.15 కోట్ల మేర అభివృద్ధి పనులు చేపట్టామని వివరించారు. తమ ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలతో పాటు అభివృద్ధి పనులను సమాంతరంగా చేపడుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ నగేష్‌కుమారి, డిప్యూటీ తహసీల్దార్ సాయిగణేష్‌బాబు, సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ పెదమల్లు రమణారెడ్డి, ఉపసర్పంచ్ పామూరు లచ్చారెడ్డి, మాజీ సర్పంచ్ పలుకూరు పోలిరెడ్డి, నాయకులు మురళీకృష్ణారెడ్డి, ఆకుల గంగిరెడ్డి, డీ శ్రీనివాసులురెడ్డి, అచ్చాల సుధాకర్‌రెడ్డి, శ్రీహరి, పీ శ్రీనివాసులురెడ్డి, సమరసత సేవా ఫౌండేషన్ రాష్ట్ర బాధ్యుడు విష్ణు, మండల బాధ్యుడు లక్కాకుల ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

టైర్ పగిలి కారు బోల్తా

• ఐదుగురికి తీవ్ర గాయాలు



పొలంలోకి దూసుకెళ్లిన కారు



అంబులెన్స్‌లో క్షతగాత్రుల తరలింపు

దుత్తలూరు: కారు అదుపుతప్పి బోల్తాపడటంతో ఐదుగురు తీవ్రంగా గాయపడిన ఘటన దుత్తలూరు – నర్రవాడ మార్గంలోని 565వ జాతీయ రహదారిపై శనివారం చోటుచేసుకుంది. వివరాలు.. కడపకు చెందిన చంద్రశేఖర్‌రెడ్డి, నాగేంద్ర ప్రసాద్‌రెడ్డి, వెంకట సులోచన, శ్రీలత, హరినాథ్‌రెడ్డి కారులో గుంటూరు బయల్దేరారు. ఈ తరుణంలో దుత్తలూరు శివారులోని పెట్రోల్ బంక్ సమీపంలో కారు ముందు టైర్ పగిలి వాహనం అదుపుతప్పి పక్కనే ఉన్న కాలువలోకి దూసుకెళ్లింది. ప్రమాదంలో వెంకట సులోచన, శ్రీలతకు వెన్నుపూస దెబ్బతినడంతో పాటు ఎడమ చేయి విరిగింది. మిగిలిన ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం హైవే అంబులెన్స్‌లో ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం ఇతర ప్రాంతాలకు తరలించారు. కాగా ఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

గేదెలను తప్పించే క్రమంలో..

మర్రిపాడు: రోడ్డుపైకి వచ్చిన గేదెలను తప్పించే క్రమంలో లారీ బోల్తాపడిన ఘటన పొంగూరుకండ్రిక సమీపంలో నెల్లూరు – ముంబై జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. వివరాలు.. బద్వేల్ నుంచి కృష్ణపట్నం పోర్టుకు లిక్విడ్ యాసిడ్ లోడుతో లారీ బయల్దేరింది. ఈ క్రమంలో పొంగూరు కండ్రిక సమీపంలో శనివారం తెల్లవారుజామున రెండు గంటల ప్రాంతంలో రోడ్డుపైకి గేదెలు వచ్చాయి. వీటిని తప్పించే క్రమంలో లారీ బోల్తాపడింది. సమాచారం అందుకున్న మర్రిపాడు ఎస్సై విశ్వనాథరెడ్డి తన సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకొని రోడ్డుకు అడ్డుగా ఉన్న లారీని క్రేన్ సాయంతో తొలగించారు. క్యాన్ల నుంచి లిక్విడ్ యాసిడ్ లీకవడంతో రెండు గంటల పాటు శ్రమించి వాహనాలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టారు.



మెడికల్ ఆఫీసర్ పోస్టుకు ఇంటర్వ్యూలు రేపు

నెల్లూరు సిటీ: జిల్లా వైద్య, ఆరోగ్య శాఖలో ఎన్‌హెచ్‌ఎంలో ఖాళీగా ఉన్న మెడికల్ ఆఫీసర్ పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఆసక్తి గల వారు spsnellore.ap.gov.in/notice/recruitmentను సందర్శించాలని కోరారు. అభ్యర్థులు తమ దరఖాస్తుతో పాటు అన్ని సర్టిఫికెట్లను జతచేసి, జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 నుంచి సాయంత్రం ఐదు గంటల్లోపు నిర్వహించనున్న ఇంటర్వ్యూలకు హాజరుకావాలని సూచించారు.

బీసీ సంక్షేమ సంఘ కార్యవర్గ సమావేశం నేడు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): బీసీ సంక్షేమ సంఘ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని హరనాథపురంలో ఆదివారం నిర్వహించనున్నామని సంఘ జిల్లా అధ్యక్షుడు శ్రీహరిరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి భారీగా తరలి వచ్చి జయప్రదం చేయాలని కోరారు.

'దాడికి పాల్పడింది అజీజ్, జలీలే'



మాట్లాడుతున్న మున్వర్‌బాషా

నెల్లూరు రూరల్: టీడీపీ నేత అబ్దుల్ అజీజ్, అతని సోదరుడు అబ్దుల్ జలీల్ వారి అనుచరులతో తనపై ఈ నెల 13న దాడికి పాల్పడ్డారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత, వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్ మున్వర్ బాషా ఆరోపించారు. మద్రాస్ బస్టాండ్ సమీపంలోని ఓ ఫంక్షన్ హాల్లో విలేకరుల సమావేశంలో శనివారం ఆయన మాట్లాడారు. ఆక్వా వ్యాపారి కిశోర్ రెడ్డి, అతని అనుచరులు తనపై దాడి చేశారని నమ్మించి తప్పుదోవ పట్టించారని ఆరోపించారు. ఆస్పత్రి నుంచి వచ్చాక ఆయా ప్రాంతాల్లోని సీసీ పుటేజీలను పరిశీలించగా, అసలు విషయం బయటపడిందని తెలిపారు. అజీజ్ కుటుంబంతో తనకెంతో కాలంగా మంచి అనుబంధం ఉందని, అలాంటి తనపై దాడి చేయడం విచారకరమని చెప్పారు. దాడి ఘటనలో కిశోర్‌రెడ్డికి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. పోలీస్ ఉన్నతాధికారులు విచారణ జరిపి అబ్దుల్ అజీజ్, జలీల్‌పై కఠిన చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం కిశోర్‌రెడ్డి మాట్లాడారు. తమ మధ్య దాడి చేసుకునేంత గొడవ ల్లేవని.. విభేదాలు సృష్టించి.. ఒకరికి తెలియకుండా ఒకర్ని హత్య చేసి ఆ నేరాన్ని తమలో ఒకరిపై మోపేందుకు పన్నాగం పన్నారని తెలిపారు. తనకు, పలువురు ఆక్వా వ్యాపారులకు అబ్దుల్ అజీజ్ అప్పున్నారని, అడిగితే దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

నిమ్మ ధరలు
పొదలకూరు
(కిలో)

పెద్దవి: రూ. 45
సన్నవి: రూ. 25
పండ్లు: రూ. 8



నెల్లూరు
పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్:	రూ.107
లేయర్	రూ.105
బ్రాయిలర్ చికెన్:	రూ.194
స్కిన్‌లెస్ చికెన్:	రూ.214
లేయర్ చికెన్:	రూ.178



ప్రాథమిక చికిత్సపై శిక్షణ



నెల్లూరు సిటీ: ప్రాథమిక చికిత్సపై 35 మందికి శిక్షణ ఇచ్చామని ఇండియన్ రెడ్‌క్రాస్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు దాసరి రాజేంద్రప్రసాద్, సుబ్బారెడ్డి, ప్రిన్సిపల్ గుర్నాథరావు పేర్కొన్నారు. ప్రాథమిక చికిత్సపై శిక్షణ తరగతులను మద్రాస్ బస్టాండ్ సమీపంలోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ భవనంలో శనివారం నిర్వహించారు. అత్యవసర పరిస్థితుల్లో చికిత్స చేసేందుకు ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. రెడ్‌క్రాస్ ఏఓ చంద్రశేఖర్‌రావు, కో ఆర్డినేటర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల గుర్తింపు జీఓ జారీపై హర్షం

నెల్లూరు (టౌన్): ప్రైవేట్ పాఠశాలలకు ఇప్పుడున్న మూడేళ్ల గుర్తింపును ఎనిమిదేళ్లకు మారుస్తూ జీఓను జారీ చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలను తెలియజేశారు. రాష్ట్రంలోని సుమారు రెండు వేలకుపైగా ప్రైవేట్ పాఠశాలలకు ఎనిమిదేళ్ల పాటు గుర్తింపు లభించడం గొప్ప పరిణామమని చెప్పారు. ఇప్పటికే పదేళ్లు పూర్తి చేసుకున్న పాఠశాలల రెన్యువల్‌కు ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకునేందుకు ఇబ్బందులు తలెత్తుతున్న తరుణంలో రాష్ట్ర ప్రభుత్వంతో ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు మాట్లాడారని, దీంతో ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునేలా అవకాశాన్ని కల్పించారని తెలిపారు. దరఖాస్తు గడువును వచ్చే నెల 31 వరకు పొడిగించారని పేర్కొన్నారు. జీఓ నంబర్ 90ను జారీ చేసే అంశంలో సహాయ సహకారాలు అందించిన విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి కృతజ్ఞతలను తెలిపారు.

అత్యాధునిక పరీక్షలు చేసేలా చర్యలు



అత్యాధునిక ల్యాబ్ పరీక్షలపై పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వైద్యులు

నెల్లూరు సిటీ: గ్రామీణ ప్రాంత ప్రజలకు అత్యాధునిక, నాణ్యమైన ల్యాబ్ పరీక్షలను నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ వసుంధరాదేవి పేర్కొన్నారు. అత్యాధునిక ల్యాబ్ పరీక్షలపై నగరంలోని జీజీహెచ్‌లో శనివారం నిర్వహించిన వర్క్‌షాపులో ఆమె మాట్లాడారు. అత్యాధునిక ల్యాబ్ పరీక్షలు, నాణ్యమైన రక్త పరీక్షలను నిర్వహించే సమయంలో చేపట్టాల్సిన జాగ్రత్తలపై జిల్లాలోని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా హాస్పిటళ్లు, జిల్లా హాస్పిటల్లో విధులు నిర్వర్తిస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. తొలుత అత్యాధునిక ల్యాబ్ పరీక్షలకు సంబంధించిన ల్యాబొరేటరీ పుస్తకాన్ని ఆవిష్కరించారు. వర్క్‌షాపు ఆర్గనైజింగ్ సెక్రటరీ మాధవి, డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, డీసీహెచ్‌ఎస్ రమేష్‌నాథ్, జీజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ మస్తాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధ తట్టుకోలేక ఆత్మహత్య

వరికుంటపాడు: అప్పుల బాధ తాళలేక చెట్టుకు ఉరేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వరికుంటపాడు మండలంలోని అశోక్‌నగర్ శివారులో శనివారం చోటుచేసుకుంది. ఎస్సై విజయ్ శ్రీనివాస్ వివరాల మేరకు.. గ్రామానికి చెందిన ఖాజామొహిద్దీన్ (38) వ్యాపార నిమిత్తం వాహనాలను కొనుగోలు చేసి జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో వాహనాలకు సంబంధించిన నగదు వాయిదాలను చెల్లించలేక గ్రామ శివారు ప్రాంతంలోని చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో ధ్వజస్తంభ ప్రతిష్ట

నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థాన ప్రాంగణంలో గల మీనాక్షిదేవి సమేత సుందరేశ్వరస్వామి నూతన ధ్వజస్తంభ ప్రతిష్ట, కుంభాభిషేక మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో శనివారం నిర్వహించారు. విశేష పూజా కార్యక్రమాలను వేదపండితులు, అర్చకుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా జరిపారు. ఉభయకర్తలుగా ఆల్తూరు గిరీష్‌కుమార్‌రెడ్డి, లత దంపతులు వ్యవహరించారు.

ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మన్ రత్నం జయరామ్, సభ్యులు గూడంశెట్టి దొరబాబు, మల్లు రామ్మోహన్‌రెడ్డి, సన్నపురెడ్డి విజయకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.